ప్రజాశక్తి
గురువారం 10 ఆగస్టు 2023 5
శ్రీ సత్యసాయి

## 660 జంటలకు కళ్యాణమస్తు సాయం

### కలెక్టర్ అరుణ్ బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో 660 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు కింద రూ.4.89 కోట్లు మంజూరు అయినట్లు కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం నాడు జిల్లా స్థాయి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా సాయం అందజేత కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించారు. జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి జూన్ నెల త్రైమాసికంలో 660 జంటలకు ఈ సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ రూ.4,89,25,000 మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపిపి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికార దర్పం..!

◆ మద్యం పట్టుకుంటావా అంటూ సెబ్ అధికారులపై ఆగ్రహం ◆ కార్యాలయానికెళ్లి వైసిపి నేతల హల్‌చల్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

వైసిపి నేతలు కొంత మంది అధికార దర్పాన్ని ప్రదర్శించారు. తమ వారు తీసుకెళ్తున్న మద్యాన్ని పట్టుకుంటారా అంటూ సెబ్ అధికారులపై ఆ పార్టీ నేతలు చిందులు తొక్కారు. ఏకంగా కార్యాలయానికెళ్లి దురుసుగా ప్రవర్తించడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. అనంతపురానికి చెందిన గుజ్జల సురేష్ అనే వ్యక్తి ఏకంగా వంద మద్యం బాటిళ్లను తీసుకుని వెలుతుండగా సెబ్ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. సదరు వ్యక్తి అధికార పార్టీ కార్పొరేటర్ అయిన సాకే చంద్రశేఖర్, కమల్‌భూషణ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు తమ అనుయాయులతో కలసి సెబ్ కార్యాలయానికి బుధవారం సాయంత్రం వెళ్లారు. అక్కడికెళ్లి మద్యం బాటిళ్లు ఏ విధంగా పట్టుకుంటారని ప్రశ్నించారు. ఇదే సందర్భంలో ఎస్ఐ సీటులో కూర్చోవడానికి ప్రయత్నించారు. అధికారి సీటులో కూర్చోవద్దని మహిళా కానిస్టేబుల్ చెప్పడంతో ఆమెపై చిందులు తొక్కారు. ప్రజాప్రతినిధులమైన తమనే సీటులో కూర్చోవద్దంటావా అని ఆమెపై చిందులు తొక్కారు. ఇంతలోనే ఎస్ఐ మునిస్వామి అక్కడికి చేరుకున్నారు. ఆయన పట్ల కూడా ఇద్దరు నేతలు దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. అడ్డుకోబోయిన కానిస్టేబుల్ శేఖర్, మహిళా కానిస్టేబుల్ రాధమ్మ తదితరుల పట్ల కూడా ఇదే తీరుతో వ్యవహరించారు. జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోలు సైతం బయటకు రావడం పెద్ద చర్చనీయాంశమైంది. దీనిపై ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే దాన్ని అడ్డుకునేందుకు పైస్థాయి నుంచి ఒత్తిళ్లు తీసుకొచ్చే ప్రయత్నాలు చేసినట్టు ఆరోపణలున్నాయి.

అనంతపురం సెబ్ కార్యాలయంలోమహిళా కానిస్టేబుల్‌పై చిందులు తొక్కుతున్న అధికారపార్టీ నాయకులు

**సమస్యను సద్దుమణిచేందుకు యత్నం.?**

అధికార పార్టీ నేతల వ్యవహారం బయటకొచ్చినప్పటికీ సైలెంట్‌గా సదుమణించేందుకు కొంత మంది అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అధికారపార్టీ ప్రజాప్రతినిధులు కావడంతో అధికారులను సైలెంట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులపై తీవ్రమైన ఒత్తిళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బాటిళ్లు అన్నీ ఒకేసారి తీసుకెళ్లలేదని, విడివిడిగా బిల్లులు చేసినట్టు అధికారపార్టీ నేతలు చబుతున్నారు. నిబంధనల ప్రకారమైతే మూడు బాటిళ్లకు మించి ఒక వ్యక్తి తీసుకెల్లడానికి వీల్లేదు. కాని ఇక్కడ ఒకేసారి తీసుకెళ్లినప్పటికీ వేరువేరుగా తీసుకున్నట్టు చెప్పి అసలు విషయాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

**దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం**
**అడిషనల్ ఎస్పీ రామకృష్ణ**

సెబ్ కార్యాలయంలో జరిగిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ విలేకరులకు రామకృష్ణ తెలిపారు.

# మోడీని గద్దె దింపితేనే దేశానికి రక్ష

### సిఐటియు ఆధ్వర్యంలో క్విట్ బిజెపి నిరసన

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దింపితేనే దేశానికి రక్షణ ఉంటుందని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. 'మోడీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన 8 సంవత్సరాల్లో ప్రజల జీవనప్రమాణాలు పడిపోయాయన్నారు. బిజెపి కార్పొరేట్ల సేవలో తరిస్తూ ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులకు తీరని నష్టదాయకంగా ఉన్నాయన్నారు. గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించరాదని కోరారు. కార్మికులందరికీ సాంఘిక భద్రత కల్పించి పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష అభియాన్, వెలుగు అర్బన్ హెల్త్, ఉపాధి హామీ 108, 104 తదితర స్కీం వర్కర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కింద రోజు 600 రూపాయలు కూలి ఇచ్చి, 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆటో వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి పెడపల్లి బాబా, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పైపల్లి గంగాధర్, ఓబులేసు, శివ, నారాయణస్వామి, సిద్ధు, శివ పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, పేదలు

## పెనుకొండలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తాం

### కలెక్టర్ అరుణ్ బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

పెనుకొండలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలందరినీ పరిశీలించి అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని కలెక్టర్ అరుణ్ బాబు సిపిఎం నాయకులు, పేదలకు హామీ ఇచ్చారు. పెనుకొండలోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు మంగళవారం నాడు బలవంతంగా తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద అక్కడి పేదలు దరఖాస్తు చేశారన్నారు. అధికారులు పోలీసుల పహారాతో పేదలు వేసుకున్న గుడిసెలను నేలమట్టం చేశారన్నారు. అడ్డుకోబోయిన మహిళలపై దాడి కూడా జరిగిందన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెనుకొండలో జరిగిన సంఘటనలను ఆయనకు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. పెనుకొండలో అర్హత ఉన్న పేదలందరికీ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, నాయకులు గంగాధర్, వెంకట రాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### కలెక్టర్ అరుణ్ బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, డివిజన్ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసులు చైతన్యవంతులు అయ్యి అందరూ బాగా చదవాలన్నారు. ప్రభుత్వ సాయాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో జిల్లాలోని అన్ని ప్రాంతాలను సందర్శించి గిరిజనుల అభివద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ, పర్యావరణం, విద్య, వైద్య రంగాలలో అభివద్ధి సాధించడానికి ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, గిరిజన నాయకులు కష్ణా నాయక్, ఆనంద్ నాయక్, కాలే నాయక్, అజయ్ నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్

# చలో విజయవాడతో కార్మికుల సత్తా చూపిస్తాం

### సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, నాయకులు

**ప్రజాశక్తి-హిందూపురం**

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఆందోళన కార్యక్రమాలు చేస్తే..సమస్యలను పరిష్కరించ డానికి చేతగాని ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని కార్మికులపై దాడులు, అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప విమర్శించారు. ఈ నెల 7వ తేదీన సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడిలో పోలీసులు కార్మికులపై చేసిన దాడులను, అక్రమ అరెస్టులను ఆయన ఖండించారు. దీనికి నిరసనగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్యకార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే పోలీసులను ఊసిగొల్పి అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమన్నారు. ఈ నెల 17న కార్మికుల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పి జగదీష్, ఆనంద్, రామచంద్ర, మంజునాథ్, మూర్తి, గుర్నాధ్, బాలాజీ, చంద్ర, కృష్ణమూర్తి, శివ, క్లాప్ అనిల్, కవితమ్మ, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ అడ్మిషన్ల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

**ప్రజాధశక్తి-హిందూపురం**

పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బాబావలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని ఆర్భాటాలకు పోయి అడ్మిషన్లను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పదవ తరగతి పరీక్షల ఫలితాలు వచ్చిన ఐదు రోజులకే పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారన్నారు. పాలిసెట్ ద్వారా 1 లక్షా 41 వేల మంది దరఖాస్తు చేసుకోగా దాదాపు 1 లక్షా 20 వేల మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారిలో కొంత మంది ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు వెళ్లారని, మరికొంత మంది ఇతర కోర్సుల్లో చేరారని చెప్పారు. 75 రోజులు గడుస్తున్నా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇంత ఆలస్యం చేస్తుందో అంతుబట్టడం లేదన్నారు. గత అనుభవాలతో అడ్మిషన్లను పూర్తి చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్నడు లేని విధంగా రెండు నెలలు పైగా ఆలస్యం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో డిగ్రీ, ఇంటర్ మినహా మిగిలిన అన్ని సెట్లు అడ్మిషన్లు పూర్తి కాకపోవడాన్ని బట్టిచూస్తే ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తుందనడానికి ఒక ఉదాహరణని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పాలిటెక్నిక్ అధికారులు వారంలోగా వెబ్ ఆప్షన్స్ ప్రారంభించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## నాడు-నేడు పనుల్లో అలసత్వం తగదు : ఎంపిపి

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని కల్లుకుంట పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంపిపి పురుషోత్తమరెడ్డి బుధవారం పరిశీలించారు. పాఠశాలకు నాడు నేడు నిధులు మంజూరు అయ్యి సంవత్సరం అవుతున్న ఏ మాత్రం పనులు ప్రారంభం కాకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వం తగదని ఎంఇఒ సల్మాన్ రాజ్‌ను హెచ్చరించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వేణు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న దృశ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

## విధినిర్వహణలో క్రమశిక్షణ అవసరం

**ధర్మవరం టౌన్ :** క్రమశిక్షణతో కూడిన విధులను నిర్వర్తిస్తే ప్రతి ఒక్కరికి విజయం వర్తిస్తుందని ఆర్డీవో తిప్పేనాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయ సమావేశ భవనంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు, సూపర్వైజర్లకు, తహశీల్దార్లకు ఇంటింటా ఓటు సర్వేపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రకటించిన షెడ్యూల్ తేదీలోగా ఇంటింటా ఓటరు రీ సర్వే పూర్తిచేసే ప్రగతిపై వారు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉప ఎన్నికల తహశీల్దార్ అనిల్ కుమార్ రెడ్డి, సిబ్బంది రాజకుమార్, పట్టణ, గ్రామీణ బిఎల్ఒలు, తహశీల్దార్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఎఐఎల్‌యు మహాసభల పోస్టర్లు విడుదల

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

గుంటూరులో ఆగస్టు 12, 13 తేదీలలో జరుగుతున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఎఐఎల్ యు) మహాసభలకు సంబందించిన పోస్టర్లను ధర్మవరం బార్ అసోసియేషన్ నాయకులు బుధవారం విడుదల చేశారు. ఆ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిష్టమూర్తి, ట్రెజరర్ బిల్లే రవి, మాజీ అధ్యక్షులు కృష్ణయ్య, సీనియర్ న్యాయవాదులు కృష్ణమోహన్ , కరీం, జిల్లా అధ్యక్షులు వీరు యాదవ్, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్, ప్రసాద్, మల్లేష్ తదితరులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరు యాదవ్,సతీష్, సూర్యచంద్ర, ప్రసాద్,మలేష్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర మహాసభలు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

# ఇళ్ల మధ్యనే చెత్త నిల్వ

### ఇబ్బందుల్లో గ్రామస్తులు

నివాసగృహాల వద్ద పోగేసిన చెత్త,వ్యర్థాలు

**ప్రజాశక్తి - తనకల్లు**

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో ఇళ్ల మధ్యనే చెత్తను నిల్వ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొక్కంటి క్రాస్ గత 15 సంవత్సరాల నుండి అభివృద్ధి చెందుతోంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతిసోమవారం నిర్వహించే వారపు సంతతో ఈ ప్రాంతం కిక్కిరిపోతుంది. రోడ్డు పక్కనే వారపు సంత నిర్వహిస్తుండటంతో ఇక్కడ తీవ్ర రద్దీ నెలకొంటుంది. రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తుండటంతో ఈ ప్రాంతం డంపింగ్‌యార్డును తలపిస్తోంది. దీంతో కొక్కంటి తదితర గ్రామాలకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమీప ఇళ్లలోని వారు ఆ దుర్గంధం భరించలేకపోతున్నారు. అవ్యర్థాలలో దోమలు ప్రబలి అంటు రోగాలు వ్యాపిస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. ఆ వ్యర్థాలనుఅప్పుడప్పుడు కాలుస్తుంటారని, అక్కడ వచ్చే పొగతో మరింత ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ వ్యర్థాలపై బాలసముద్రం పంచాయతీ కార్యదర్శి వద్ద ప్రస్తావించగా నెలకు ఒకసారి అక్కడి వ్యర్థాలను మరోచోటికి తరలిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి ఎక్కడా కూడా డంపింగ్ యార్డ్ కు స్థలం లేదని తెలిపారు. ఇప్పటికైనా మండల అధికారులు సమస్యపై దృష్టిసారించి డంపింగ్ యార్డ్ కు స్థలం కేటాయించి ఆ వ్యర్థాలను అక్కడికి తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పోస్టల్ ఏఎస్పీగా కళ్యాణ్ రామ్

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

కేంద్ర ప్రభుత్వ తపాల శాఖలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్‌గా ఇటీవల పదోన్నతి పొందిన కళ్యాణ్‌రామ్ హిందూపురం సబ్ డివిజనల్ ఏఎస్పీగా గురువారం పదవీ బాధ్యతలను గురువారం చేపట్టనున్నారు. ఆయన ప్రస్తుతం ధర్మవరం పోస్టల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తూ పదోన్నతి పొందారు.

## టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

**ప్రజాశక్తి బుక్కపట్నం**

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి సత్య సాయి జిల్లా కార్యదర్శి సాముకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తుకు గ్యారంటీ ,మహాశక్తి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, పార్లమెంట్ కార్యదర్శి మాధవి, నాయకులు కౌన్సిలర్ చిన్నకృష్ణమ్మ, మస్తానయ్య, కేశవయ్య, సంగా శివయ్య,, సీనా, రఘునాథ్ రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవిపై ఎమ్మెల్యే శంకరనారాయణ ఫైర్

**ప్రజాశక్తి -పెనుకొండ**

సినీనటులు, మాజీ ఎంపీ చిరంజీవి పై పెనుకొండ ఎమ్మెల్యే మాలకొండ శంకర్ నారాయణ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీలోని 15,16వ వార్డు పరిధిలోని జిఐ సి కాలనీ, వడ్రాల పేట ప్రాంతాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిరంజీవి, పవన్‌కళ్యాణ్‌ల సినిమాలు ఫ్లాప్ కావడం వల్ల ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారన్నారు. గతంలో కేంద్ర మంత్రిగా ఉంటూ చిరంజీవి రాష్ట్రానికి ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని ఎందుకు చిరంజీవి అడగలేదన్నారు. తన తమ్ముడు పవన్ కళ్యాణ్‌కు ఉన్న పదవి కాంక్ష నెరవేర్చేందుకు చిరంజీవి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి కలసి కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మంచి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమెల్సీ మంగమ్మ, ఎజిపిఎం భాస్కర్ రెడ్డి,ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి,జడ్పీటీసీ శ్రీరాములు, మునిమడుగు శ్రీనివాసులు, స్థానిక చర్చి పాస్టర్ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ రఘునాథరెడ్డి, తయూబ్ ,కొండల రాయుడు,టౌన్ కన్వీనర్ నరసింహ,నాయుడు,గోపాల్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శిస్తున్న 'గోనుగుంట్ల'

## బాధితుడికి ఆర్థికసాయం

**ధర్మవరం టౌన్ :** పట్టణంలో 9వ వార్డు చిన్నూరుకు చెందిన బోగం కుళ్లాయప్ప బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురంలోకి కేకే నర్సింగ్‌హోంలో చికిత్సపొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ' అనంతపురంలోని నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న బోగం కుళ్లాయప్పను పరామర్శించి వైద్యం ఖర్చుల కోసం రూ.25 వేలు అందజేశారు.

## విద్యార్థులకు అవగాహన

**నల్లచెరువు :** స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఐనుద్దీన్ ఆధ్వర్యంలో నులిపురుగులు వాటివలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విషయంపై స్థానిక ప్రైవేట్ గార్డియన్స్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, గార్డియన్స్ స్కూల్ హెడ్మాస్టర్, కరస్పాండెంట్ డేవిడ్ జోసెఫ్, సూపర్వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, మున్నాభాయ్, ఆఫీస్ సబార్డినేట్ ప్రకాష్, ఆశా కార్యకర్త సుజాత, గార్డియన్స్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గర్భిణులకు వైద్యపరీక్షలు

**నంబుల పూలకుంట :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు డాక్టర్. అయేషా ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అధిక రక్తపోటు, మధు మేహం, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి తగిన ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగలక్ష్మి, శాంతమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు కె. మహేశ్వర రెడ్డి, రాధమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ భాస్కర్ నాయక్, గీతారాణి, దేవి ప్రియాంకతో పాటు ఆశాలు కవిత, నరసమ్మ, లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

## 11న జాబ్‌మేళా

**బుక్కపట్నం :** నిరుద్యోగ యువతీ యువకులు రిసోర్స్ పర్సన్ లు 11వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సిల్క్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఖయూం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన బుక్కపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని నిరుద్యోగ యువతీ యువకులు హాజరై జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పురపాలక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

**ధర్మవరం టౌన్ :** పురపాలక అభివృద్ధినపై అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధను కనపరచాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ పరిపాలన అధికారి కోటేశ్వరరావు సూచించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కొన్ని అంశాలపై వారు తెలిపిన విషయాలను కమిషనర్ తెలిపారు. ఇంటి పన్ను వసూలు, యూజర్ చార్జీలు వసూలును వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా అక్రమ కట్టడాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకొని మునిసిపల్ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారన్నారు. అక్రమ కట్టడాలు, రీ సర్వే, జగనన్నకు చెబుతాం, అన్న విషయాల విషయాలపై శ్రద్ధ కనబరచాలని సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఆనంద్, డిపిఆర్ఒ సుబ్బరాయుడు, ఇంజనీరింగ్ డీఈ వన్నూరుస్వామి, ఏఈ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

**గోరంట్ల:** పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల నందు పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయిన నేపథ్యంలో వారిని బుధవారం ఘనంగా సన్మానించారు బదిలీ అయిన ఉపాధ్యాయులు అంకాల రెడ్డి, వెంకటేశులు, సుధాకర్, రాజేశ్వరి, అనంతలక్ష్మి, కృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్, ప్రకాష్ రెడ్డి, ఫకీర్ నాయక్, రామ్మోహన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**తనకల్లు :** మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో గల గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ సుస్మిత జోష్నా అధ్యక్షతన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎబిఎస్ఎస్ తనకల్లు మండల అధ్యక్షుడు ఉత్తన్న నాయక్, బి రవీందర్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్ నాయక్, యూత్ ప్రెసిడెంట్ రామ్మూర్తి నాయక్, ఉపాధ్యక్షులు బి గజేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

In the court of the Addl. Junior Civil Judge, Hindupuramu
E.P.No:24/2022 in O.S.No:49/2020
Between:
1.J.Karthik Kumar, 2.M.Maujula ...D.H.R
And
1.J.Ramadevi ...J.D.R
Notice to Judgement Detor
1.J.రమాదేవి W/o Late శ్రీ రాములు మద్దలచెరువు మజరా తాడిమర్రి గ్రామము, తాడిమర్రి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, (పుట్టపర్తి)
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై E.P. లో D.H.R, E.P. లో J.D.R హాజరగుటకు 29/08/2023 ఉదయం 10:30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై పై E.P. నందు అభ్యంతరములు తెలుపుకొవచ్చును. లేని పక్షంలో వారి పరోక్షము నందు తీర్మానించబడనని తెలియజేయడమైనది.
వాయిదా తేది:29/08/2023
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.L.VANNERUVAPPA
Advocate, Hindupur

# చంద్రబాబుపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం : పల్లె

**ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు**

పుంగనూరులో పర్యటిస్తున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మీద జరిగిన దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని తాము అధికారంలోకి వస్తే వడ్డీతో సహా తీరుస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోనిటిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అన్నారు. ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, వైసీపీ గూండాలు రాళ్ల దాడికి దిగటం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని చెప్పటానికి నిదర్శనమని అన్నారు. పుంగనూరులో చంద్రబాబుపై, టీడీపీ కార్యకర్తలపై వైసీపీ రౌడీ మూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈవిషయంలో వైసిపి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఓటమి భయంతోనే వైసిపి ఇలాంటి దాడులకు తెగబడుతుందని, టిడిపి చూస్తూ ఊరుకోదని, దాడికి ప్రతి దాడి తమకు కూడా తెలుసునని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప , రాజారెడ్డి, నారపురెడ్డి, అంజన్ రెడ్డి, కంచి సురేష్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న 'పల్లె'

## దుకాణాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

**ధర్మవరం టౌన్ :** ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఖాళీగా ఉన్న వ్యాపార దుకాణాల నిర్వహణకు టెండర్లు పిలిచినట్లు డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దుకాణాల నిర్వహణకు పుట్టపర్తి ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఈనెల 17న టెండర్లను పిలవడం జరుగుతుందన్నారు. టెండర్ల ఫారాలు ధర్మవరం ఆర్టీసీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

# అన్ని పంటలకూ గిట్టుబాటు ధర ఇవ్వాలి

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను చట్టబద్ధత చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 24వ తేదీ ఢిల్లీలో అన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని, సోమనాథ కమిటీ సిఫారసు మేరకు రైతులకు పెట్టుబడితో పాటు 50 శాతం లాభదాయకంగా ఉండే విధంగా పార్లమెంట్లో చట్టం తేవాలని, మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని విరమింపజేయాలని, పట్టు రైతులకు పెండింగ్లో ఉన్న రాయితీ వెంటనే విడుదల చేయాలని, రైతులకు ఇచ్చే సబ్సిడీలను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా రాయితీ ఇవ్వాలని రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు పెట్టుబడి సాయం ఇవ్వాలని, కేరళ పద్ధతిలో రైతులకు రుణ విముక్తి తేవాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న ఢిల్లీలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మాగే చెరువు భాస్కర్, రైతులు వెంకటస్వామి, దాసన్న, చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు

**నల్లచెరువు :** మండలకేంద్రంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. తొలుత వీరు బస్టాండ్ కూడలిలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోటీలకు ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారిని వెలుగులోకి తీసుకొచ్చేకార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోనే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా, చిత్తూరు జిల్లా నుండి కూడా అనేక జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ టోర్నమెంటులో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో వారి క్రీడాప్రదర్శనకు తాము సహకరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపంగి గోవర్ధన్, దశరథ నాయుడు, శ్రీధర్ రెడ్డి, దొడ్డప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న నోట 'కందికుంట' మాట

## తెలుగు తమ్ముళ్లలో జోష్

**ప్రజాశక్తి కదిరి అర్బన్**

టిడిపి జాతీయ అధ్యక్షులు నిర్వహించిన కదిరి పర్యటనలో స్థానిక తెలుగు తమ్ముళ్లలో జోష్ పెరిగింది. యుద్ధభేరి పర్యటనలో భాగంగా కదిరికి వచ్చిన చంద్రబాబు నాయుడు కదిరి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల్లో జోష్ నింపారు. చంద్రబాబు నోట కందికుంట మాట రావడం, గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని చెప్పడంతో తెలుగుతమ్ముళ్లలో ఆనందం కట్టలు తెంచుకుంది. అంబేద్కర్ కూడలిలో సభకు హాజరైన జనాన్ని చూసి చంద్రబాబు నాయుడు సైతం ఆనందం వ్యక్తం చేశారు. కదిరి పై కందికుంట బ్రాండ్ కనిపించిందని రానున్న ఎన్నికల్లో కందికుంటకు గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని చెప్పారు. దీంతో 2024 ఎన్నికలకు టిడిపి అభ్యర్థి కందికుంటేనని ఖరారు చేసినట్లేనని నియోజకవర్గ టిడిపి నాయకులు చెప్పుకుంటున్నారు. ఎన్నికల సమయంలో పనిచేసి పార్టీ విజయానికి, కందికుంట విజయానికి కృషి చేస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు రాకతో తెలుగు తమ్ముళ్ల జోష్ నిండింది. కదిరి టిడిపి అభ్యర్థిగా చంద్రబాబు కందికుంటను ప్రకటించడంతో ఆయన నివాసం వద్ద సందడి సందడి నెలకొంది.

# బకాయిలు ఇప్పించండి

## ఐజీ, డీసీపీలకు ధర్మవరం వ్యాపారుల వినతి

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

విజయవాడలోని ఆలయ శిల్క్స్ యజమాని అవినాశ్ గుప్తా ధర్మవరం వస్త్ర వ్యాపారులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ధర్మవరానికి చెందిన పట్టుచీరల వ్యాపారులు కోరారు. ఈ మేరకు వారు విజయవాడలో ఐజీ క్రాంతిరాణాటాటా, డీసీపీ విశాల్ గున్నాను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. శిల్క్ యజమాని నుండి రావాల్సిన బకాయిలను ఇప్పించడంతోపాటు ఆ షాపును సీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు. రెండు, మూడురోజుల్లో న్యాయం చేసామని ఐజీ, డీసీపీలు హామీ ఇచ్చారని ధర్మవరం వ్యాపారులు తెలిపారు. వినతి పత్రం అందించినవారిలో ఏపీ బీసీ రాష్ట్ర అధ్యక్షులు కేశవశంకరరావు, సత్యసాయి జిల్లా అధ్యక్షులు మహేశ్, ధర్మవరం పట్టుచీరల వ్యాపారుల సంఘం అధ్యక్షులు గిర్రాజురవి, వ్యాపారులు పోలావెంకటనారాయణ, దత్తశివ, నీలూరి శ్రీనివాసులు, కోటంఆనంద్, బాబు, గిర్రాజు నాగరాజు, సాయికృష్ణ, పార్థసారధి తదితరులు ఉన్నారు.

# నాలుగేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలే...

## టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

**ప్రజాశక్తి కదిరి అర్బన్**

నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కందికుంట మాట్లాడుతూ వైసిపి పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కొంతమంది స్వార్థపరులైన అధికారులను అడ్డుపెట్టుకొని తమ సొంత ప్రయోజనాలకోసం పాకులాడుతున్నారని విమర్శించారు. స్థానికంగా కొంతమంది మండల నాయకులు, అధికారుల వ్యవహారశైలిని ఆయన తప్పు పట్టారు. ప్రజలకు న్యాయం చేసే పరిస్థితిలో అధికారులు లేరని విమర్శించారు ఎవరికీ పదవులు శాశ్వతం కాదని వాటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ఒక అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉంటూ అభివృద్ధికి కృషి చేయాల్సిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. వీరి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షం అనేది ప్రభుత్వాన్ని ప్రశ్నించేదేనని అధికారులు చేసిన తప్పులను ఎత్తిచూపుతూ ప్రజలకు న్యాయం జరిగేందుకు ప్రజల పక్షాన నిలబడేదే ప్రతిపక్షం అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగేంద్ర, ఇర్ఫాన తదితరులు పాల్గొన్నారు.

# ఎపిటిఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు


రొద్దం ఎపిటిఎఫ్ మండల కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి - రొద్దం**

ఎపిటిఎఫ్ 257 రొద్దం మండల కార్యవర్గాన్ని స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా లక్ష్మా నాయక్, అధ్యక్షులుగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బాలచంద్రమౌళి, ఆడిట్ కన్వీనర్‌గా హరీష్ రావు, ఉపాధ్యక్షులుగా గోపాల్, ఎం శ్రీనివాస్, టీ. వెంకటేష్, ఎం. గోకుల్, జె.రామాంజనేయులును ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మల్లికార్జున, ఎస్.జి. కృష్ణా నాయక్, పి. శ్రీనివాస రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఈ ఎన్నిక కార్యక్రమం ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జవాజి నాగరాజు, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ గౌడ్, ఆధ్వర్యంలో నిర్వహించారు.

**చిలమత్తూరు :** చిలమత్తూరు మండల కేంద్రంలోని కోడూరు పాఠశాలలో ఎపిటిఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘం ఎన్నికలను ఎన్నికల అధికారి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వరుసగా 4 వ సారి మండల ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కార్యదర్శిగా రియాజ్ బాషా, అధ్యక్షులుగా నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా శశికళను ఎన్నుకున్నట్లు ఎలెక్షన్ కో-ఆర్డీనేటర్ సూర్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

అనంతపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ శిక్షణలో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రాజశేఖర్ తెలిపారు. ఉమ్మడి అనంతజిల్లాజట్టు తరపున ఎంపికైన అనుష్క, లిఖిత, మైత్రీని క్రికెట్ అసోషియేషన్ ధర్మవరం మండల అధ్యక్షుడు వడ్డేబాలాజీ, కార్యదర్శిశంకర్, కోచ్ రాజశేఖర్లు బుధవారం గుట్టకిందపల్లి వద్ద ఉన్న ఆర్డీటీ క్రీడామైదానంలో అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు వెంకటగిరిలో ఇచ్చే శిక్షణకు బయలుదేరి వెళ్లారు. క్రికెట్లో రాణించి పేరుప్రతిష్టలు తీసుకురావాలని అసోషియేషన్ అధ్యక్షుడు వడ్డే బాలాజీ కోరారు.

క్రీడాకారులను అభినందిస్తున్న క్రికెట్ అసోషియేషన్ ప్రతినిధులు

# సమయ పాలన పాటించాలి : ఎంపిపి

**ప్రజాశక్తి. గాండ్లపెంట**

సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, అధికారులు తమ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఎంపిపి జగన్మోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పలువురు అధికారులు సమయపాలన పాటించడం లేదని పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కోఆప్షన సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ఎంపీడీవో వారం రోజుల నుంచి విధులకు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర, తహశీల్దార్ హమీద్‌బాషా, ఏవో లక్ష్మి ప్రియ, ఏపీవో మంజునాథ్ తదితర అధికారులతో పాలు వైస్ ఎంపిపిలు గంగోజమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

# నేరాలు ఘోరాలు

## మహిళ అనుమానాస్పద మృతి

**కదిరి అర్బన్ :** పట్టణ పరిధిలోని రామిరెడ్డి కాలనీకి చెందిన షేక్ భాను (40) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి భర్త షానాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థి అదృశ్యం

**గుడిబండ :** మండల పరిధిలోని రాళ్లపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు తన కుమారుడు 15 సంవత్సరాల నితిన్ సోమవారం సాయంత్రం నుండి కనబడటం లేదని గుడిబండ పోలీస్ స్టేషన్లో వారు ఫిర్యాదు చేశాడు. నితిన్ కదిరేపల్లి సెయింట్‌మేరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడని సోమవారంఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం 5:30 గంటల ఇంటికి వచ్చి పుస్తకాలు ఇంటిలో పెట్టి గుర్రపు కొండకు చెందిన అతని స్నేహితుడు వినయ్‌తో కలసి ద్విచక్రవాహనంలో వెళ్లాడని అప్పటి నుంచి కన్పించడం లేదని చెప్పాడు. ఈ విషయమై వినయ్ కుమార్‌ను అడుగగా సరైన సమాధానం చెప్పడం లేదని వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు.

## దుకాణానికి నిప్పు

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని మార్కెట్ వీధిలో ట్రాన్స్‌కో కార్యాలయం ప్రక్కన ఉన్న కుట్టుమిషన్ బంకుకు గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పుపెట్టారు. దీంతో బంకు మొత్తం కాలిబూడిదైంది. పట్టణానికి చెందిన నబీరసూల్ చిన్న బంకును ఏర్పాటుచేసుకుని అందులో కుట్టుమిషన్ ద్వారా దుస్తులు కుడుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఆయనకు ఉపాధి లేకుండా చేశారు. ఈ విషయాన్ని బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**చిలమత్తూరు :** చిలమత్తూరు మండలంలో కదిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. సత్యనారాయణ ఎరువు దుకాణాలను బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోడూరు తోపులో గల ఓ దుకాణంలో ఉన్న ఎరువుల బస్తాలను పరిశీలించారు. సుమారు రూ. 37,100లు విలువ చేసే 4.12 మెట్రిక్ టన్నుల ఎరువును డిటెన్షన్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి :** మండలంలోని రెండు ఎరువుల దుకాణాలు కదిరి సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ తనిఖీ చేశారు. ఎంఆర్‌పి ధరలకు అమ్మకాలు జరపాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీలత, ఎఇఒ పుష్పలత, వివిఎ రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గాకు స్థలం చూపించండి

**ఓబులదేవర చెరువు :** రోడ్డు విస్తరణలో ఈద్గా కబరస్థాన్ వెళ్లిపోతోందనితమ గ్రామానికి ఈద్గా ఖబర్‌స్థాన్‌కు స్థలం చూపించాలని మండల పరిధిలోని గాజుకుంట్లపల్లివాసులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ రామనాథ్‌రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 662లో ఉన్న స్థలం రోడ్డు విస్తరణలో పోతోందన్నారు. ఇక్కడ వంద కుటుంబాలు నివసిస్తున్నాయని ఆస్థానంలో మరొక చోట ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. ఆ స్థలంలో కబరస్తాన్ ఈద్గా నిర్మించుకుంటామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రఫీక్, బాబా ఫక్రుద్దీన్, షామీర్ భాష, అస్లాం, మహమ్మద్ అలీ , నజీర్, హైదర్ వల్లి , తదితరులు పాల్గొన్నారు.

## ఎండియు వాహనాల ద్వారానే బియ్యం సరఫరా చేయాలి

**సోమందేపల్లి :** మండలంలో ఎండియు వాహనాలు మూలన పడేశారని వాహన ఆపరేటర్లు వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సురేష్ కుమార్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎం డి యు వాహనదారులు ఇళ్ల దగ్గర బియ్యం పంపిణీ చేయాలన్నారు. నేటికీ స్టోర్ డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లా బకాష్, చాంద్ బాషా ,ఆంజనేయులు, రఫీ, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## 11న బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**తనకల్లు :** మండల పరిధిలోని మార్పురివాండ్లపల్లిలో ఈ నెల11న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు చెరుకూరి గంగులయ్య కోరారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్నిఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీటీసీ జక్కల శ్రీలత, ఎంపీపీ వైవి కౌసల్య,మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఈశ్వర్ రెడ్డి, తవలం సర్పంచి శ్రీనివాసులుతో పాటు మండల స్థాయి అధికారులు, నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు.

## వార్డుమెంబర్ స్థానానికి నామినేషన్ దాఖలు

**బత్తలపల్లి :** మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు స్థానానికి లక్ష్మీనారాయణమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. సర్పంచి సానే జయచంద్రారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఉప సర్పంచి వీడాల ప్రతాపరెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరి, లింగమయ్య, చరణ్‌కుమార్ రెడ్డి, సంద్రా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హుండీ ఆదాయం లెక్కింపు

**కదిరి అర్బన్ :** శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి, ఛైర్మెన్ జెరిపిటి గోపాల క్రిష్ణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## నిష్పక్షపాతంగా ఓటరు జాబితా పరిశీలన

**బత్తలపల్లి :** ఇంటింటికి వెళ్లి ఓటరుజాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా చేపట్టాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి బిఎల్ఒలకు సూచించారు. బుధవారం బత్తలపల్లిలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను తహశీల్దార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు నరసింహ, రానా ప్రతాప్, హరిప్రియ, హసీన్బీ, టిడిపి క్లస్టర్ ఇంచార్జి నెట్టెం రమణ, యూనిట్ ఇన్‌ఛార్జి బత్తల మనోజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మందల సదాశివ, ఐటీడీపి దేరంగుల హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో టేక్ హోమ్ రేషన్ పంపిణీ

**పెనుకొండ :** ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు టేక్ హెూమ్ రేషన్ ఇవ్వాలని సిడిపిఒ ఆదేశించారు. పట్టణంలోని ఐసీడీస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పెనుకొండ,రొద్దం మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు బుధవారం ప్రాజెక్టు మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ఎఫ్ ఆర్ ఎస్ యాప్ నిర్వహణ లో ఏ విధమైన సందేహాలు వున్నా వెంటనే సూపర్‌వైజర్ల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజరుల సుజాత, అనురాధ , అలివేలమ్మ ,పుష్ప , యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**గోరంట్ల:** పట్టణంలోని బాలిక హై స్కూల్, ఎం ఆర్ సి, బాలుల హై స్కూల్‌లోని పోలింగ్‌కేంద్రాలను సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం పరిశీలించారు. అక్కడి వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంఇఒ జాన్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## మొహరం వేడుకలు

**ముదిగుబ్బ:** మండల కేంద్రంలోని పాతూరులో మొహరం వేడుకలు నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా బుధవారం పీర్లను ఊరేగించి, చిన్న చావిడివద్ద ఉరుసు మహోత్సవం నిర్వహించారు.